



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	35	25
భద్రాద్రి	34	27



పొలంగట్టుపై నడుచుకుంటూ...



పొలం గట్టుపై కూర్చొని రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టర్ పొలంబాట

- బూట్లు విప్పి గట్లపై నడిచి.. రైతులతో భేటీ
- సాగులో సాదక బాధకాలపై ఆరా..

6



డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎన్నికై మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమితులైన కొత్వాలను సన్మానిస్తున్న మార్క్‌ఫెడ్ పాలకమండలి

రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల

ఖమ్మం/కొత్తగూడెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య లిమిటెడ్ ఎక్స్ అఫిషియో డైరెక్టర్‌గా ఖమ్మం డీసీఎంఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు నియమితులయ్యారు. హైదరాబాదులో శుక్రవారం టీజీ మార్క్‌ఫెడ్ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్తగా డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎన్నికైన కొత్వాలను పాలకమండలి మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి తదితరులు సన్మానించారు. ఆయనను మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా కూడా నియమించారు. తన నియామకానికి కృషిచేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు కొత్వాల కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఐ ఆత్మహత్యాయత్నం కేసులో

కీలక మలుపు

- అశ్వారావుపేట సీఐ, నలుగురు కానిస్టేబుళ్లపై అట్రాసిటీ కేసు
- ఎస్ఐ భార్య ఫిర్యాదుతో కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన మహబూబాబాద్ టౌన్ సీఐ దేవేందర్

అశ్వారావుపేట/మహబూబాబాద్ రూరల్, జూలై 5: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఆత్మహత్యాయత్నం వ్యవహారం కీలకమలుపు తిరిగింది. ఎస్ఐ శ్రీను ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా అతడి పరిస్థితి ప్రస్తుతం విషమంగానే ఉన్నట్టు సమాచారం. అయితే శుక్రవారం ఎస్ఐ శ్రీను భార్య శ్రీరాముల కృష్ణవేణి తన భర్త ఆత్మహత్యాయత్నానికి అశ్వారావుపేట సీఐ, నలుగురు కానిస్టేబుళ్ల వేధింపులే కారణమని హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో అక్కడి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, మహబూబాబాద్ స్టేషన్‌కు పంపారు. ఈ నేపథ్యంలో అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డితోపాటు మరో నలుగురు పోలీస్ సిబ్బందిపై మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నార్కపేటకు చెందిన శ్రీరాముల శ్రీనివాస్ భద్రాదికొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ స్టేషన్ సీఐ జితేందర్‌రెడ్డితోపాటు మరో నలుగురు పోలీస్ సిబ్బంది ఎస్ఐ శ్రీనివాస్‌ను వేధింపులకు గురిచేయడంతో మనస్థాపానికి గురై జూన్ 30న మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు అర్తిగార్డెన్ సమీపంలో పురుగులమందు తాగి తర్వాత 108కు సమాచారం ఇచ్చాడు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, టౌన్ ఎస్ఐ అరుణలు ఘటన స్థలానికి చేరుకుని 108 ద్వారా చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్‌కు మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. బాధితుడు శ్రీనివాస్ భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డితోపాటు కానిస్టేబుళ్లు సుభాని, శేఖర్, సన్యాసయ్య నాయుడు, శివనాగరాజులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు మానుకోట టౌన్ సీఐ దేవేందర్ తెలిపారు.

ఇందిరా డెయిరీ ద్వారా

20వేల మందికి ప్రయోజనం

- పాడి రైతుల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి
- ఖమ్మం డీఆర్‌డీవో సన్యాసయ్య

7

రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎ.రేవంత్‌రెడ్డి, నారా చంద్రబాబునాయుడు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శనివారం భేటీ కానుండటంతో వీరి మీటింగ్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇరువురు సీఎంల మధ్య సుహృద్భావ వాతావరణం ఉండటంతోపాటు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరిస్తే తమకేమీ అభ్యంతరం లేదని గతంలో బీజేపీ కీలక నేతలు పేర్కొనడంతో ఈసారి ఐదు పంచాయతీలు భద్రాద్రిలో విలీనం కావడం ఖాయమని భద్రాద్రి ఏజెన్సీవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సందిగ్ధమేనా.. స్పష్టతొచ్చేనా?



పురుషోత్తపట్నంలో తాజాగా రామయ్య భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతుండగా అడ్డుకున్న దేవస్థానం అధికారులు (ఫైల్)

దశాబ్దకాలంగా సాగుతున్న విలీన పంచాయతీల సమస్య

- సరిహద్దు సమస్యలతో ఇబ్బందులెదుర్కొంటున్న ప్రజలు
- ఇంకా అపరిష్కృతంగానే అనేక సమస్యలు
- నేడు సీఎంల భేటీపై ఏజెన్సీవాసుల్లో సర్వత్రా ఉత్కంఠ

భద్రాచలం/ఖమ్మం (ఆంధ్రజ్యోతిప్రతినిధి), జూలై 5: రాష్ట్ర ఆవిర్భావం అనంతరం పోలవరం ముంపు మండలాల పేరుతో ఏడు మండలాలను ఏపీ పరిధిలో విలీనం చేయడంతో భద్రాచలం ఏజెన్సీలో అనేక సమస్యలు దశాబ్దకాలంగా తలెత్తుతున్నాయి. ముఖ్యంగా భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని భద్రాచలం మండలంలో (పంచాయతీ మినహాయించి) ఏపీలో విలీనం చేయడంతో అభివృద్ధిపరంగా, పాలనపరంగా, ప్రజావసరాలపరంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు వివిధ ప్రాంతాలకు తరలిపోవడంతో నాడు రాష్ట్ర ఆవిర్భావంతో భద్రాచలంను జిల్లా కేంద్రంగా చేస్తామని ప్రకటించిన తెలంగాణ పోరాట యోధుల హామీ అమలుకు నోచుకోని పరిస్థితి ఉంది. కాగా గతంలో ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద ఐటీడీఏగా పేరుగాంచిన భద్రాచలం పరిధి తగ్గడంతో ఉనికే ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితులు ఉన్నాయి. కనీసం చెత్తను డంప్ చేసేందుకు డంపింగ్ యార్డుకు జాగా సైతం లేకపోవడంతో పవిత్ర గోదావరి నదీ తీరాన కరకట్టపై చెత్తను డంప్ చేస్తున్న దుస్థితి ఉందంటే పరిస్థితి ఏ రీతిన ఉందో అవగతమవుతోంది. శ్మశాన వాటిక సైతం నిర్మించేందుకు జాగా లేని పరిస్థితి భద్రాద్రిలో నెలకొంది.

దశాబ్దకాలంగా సమస్యలు.. అవస్థలు


గత దశాబ్దకాలంగా తెలంగాణ-ఆంధ్రా సరిహద్దుల్లోని భద్రాచలంతోపాటు ఐదు పంచాయతీల్లో సమస్యలు, అవస్థలు అన్నీ ఇన్నీ కావు. భద్రాద్రికి కూతవేటు దూరంలోని రామయ్య భూములు ఏపీలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో ఉండగా అక్కడ ఉన్న సుమారు 900 ఎకరాల భూముల్లో తరచూ ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయంపై అక్కడి మండల అధికార యంత్రాంగానికి దేవస్థానం అధికారులు ఫిర్యాదు చేసినా సానుకూల స్పందన లేదని దేవస్థానం వర్గాలు వాపోతున్నాయి. మరోవైపు భద్రాచలం నుంచి పర్ణశాల వెళ్లే మార్గంలో ఎనిమిది కిలోమీటర్లు ఏపీ పరిధిలో ఉండటంతో అక్కడ రహదారులపై ప్రయాణం ఎంతో ఇబ్బందికరంగా ఉంటోంది. అదేవిధంగా రామాయణ ఇతివృత్తంతో ముడిపడి ఉన్న యటపాకలోని జటాయువు మండపం, గుండాలలోని ఉష్ణగుండాల సైతం భద్రాద్రి పరిధిలోకి రావాలని రామ భక్తులు ఆకాంక్షిస్తున్నారు. అలాగే పిచుకలపాడు సైతం భద్రాద్రిలోనే కలపాలనే డిమాండ్ ఉంది. ఈ ఐదు పంచాయతీలకు చెందిన వారు ఏపీలోని తమ జిల్లా కేంద్రానికి వెళ్లి రావాలంటే 800 కి.మీ. ప్రయాణించాల్సి ఉంది. ముఖ్యమైన విషయం ఏమిటంటే జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం అంతంత మాత్రమేనని స్థానికులు వాపోతున్నారు. వరదల సమయంలో ఇతర విపత్కర సమయంలో తమకు అందుబాటులో ఉన్నతాధికారులు ఉండడం లేదని, ఈ పరిస్థితి నుంచి తమకు విముక్తి లభించాలంటే తమ ఐదు పంచాయతీలను తెలంగాణలోని భద్రాద్రిలో విలీనం చేయాలని ఆయా గ్రామా ప్రజలు ఇప్పటికే కేంద్ర మంత్రులు, గవర్నరు, ముఖ్యమంత్రులకు విన్నవించారు. తాజాగా వారు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఇప్పటికే వారు కలవగా నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సైతం కలవనున్నారు.

ఏరివేతలో దాటవేత

360 డిగ్రీ యాప్ ద్వారా ఖమ్మం జిల్లాలో 227 మంది అక్రమ పింఛన్‌దారుల గుర్తింపు

- సొమ్ము రికవరీలో అధికారుల అలసత్వం
- రూ.1.5కోట్లకు ఆరుగురు నుంచి కేవలం రూ.3.5లక్షలే వసూలు
- వారం రోజులుగా కొనసాగుతున్న సర్వే
- నూతనంగా మరో 90 అక్రమ పింఛన్లు వెలుగులోకి
- ప్రభుత్వ సొమ్ము తిరిగి రాబట్టడంలో జిల్లా వెనుకబాటు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 5: నిరాశ్రయలకు ఆర్థికంగా ఆసరా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకం ద్వారా ఆసరా పింఛన్లు పంపిణీ చేస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న దివ్యాంగులు, వయోవృద్ధులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, వితంతువులు, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు ఇలా 9 రకాల వ్యక్తులకు ప్రభుత్వం చేయూత పథకం ద్వారా పింఛన్ కల్పిస్తోంది. అయితే రాజకీయ జోక్యం, సాంకేతిక విషయాల మాటున వందల సంఖ్యలో అక్రమంగా పింఛన్లు పొందుతుండడంతో సంక్షేమ పథకాలు దుర్వినియోగమవుతున్నాయి. దాంతో రాష్ట్ర ప్రభుత్వం '360డిగ్రీ' యాప్ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల జాబితాలను ఆధార్ లింక్ చేసి పరిశీలించింది. దీంతో అక్రమంగా పింఛన్లు పొందుతున్న వారు బయటపడ్డారు. దీంతో వారి నుంచి సొమ్ము రికవరీ చేపట్టాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు కార్యాచరణ ప్రకటించారు.



డీఆర్డీవో కార్యాలయం నుంచి ఫోన్‌లో వివరాలు సేకరిస్తున్న ఉద్యోగి

వారం రోజులుగా సాగుతున్న సర్వే

క్షేత్రస్థాయిలో చేయూత(ఆసరా) పింఛన్ల సర్వే పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో సాగుతోంది. ఖమ్మం జిల్లాలో అక్రమ పింఛన్ పొందుతున్న వారి జాబితాలను గత శనివారం రాష్ట్రస్థాయి అధికారులు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులకు పంపారు. ఈ జాబితా ప్రకారం బోనకల్ 5, చింతకాని 7, ఏన్కూరు 1, కల్లూరు 4, కామేపల్లి 1, ఖమ్మం రూరల్ 10, ఖమ్మం మున్సిపాలిటీ 139, కొణిజర్ల 2, కూసుమంచి 3, మధిర మండలం 6, మధిర మున్సిపాలిటీ 4, ముదిగొండ3, నేలకొండపల్లి 2, పెనుబల్లి 5, రఘునాథపాలెం 4, సత్తుపలి 1, సత్తుపల్లి మున్సిపాలిటీ 10, సింగరేణి 3, తల్లాడ 1, తిరుమలయాపాలెం 4, వైరా 4, ఎర్రుపాలెంలో ఒకరు అక్రమంగా ఆసరా చేయూత పింఛన్లు పొందారు. అక్రమ పింఛన్‌దారుల జాబితాలను ఎంపీడీవోలకు వారి నుంచి పంచాయతీ కార్యదర్శులకు అందించారు. జాబితాలపై సర్వేచేసి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసి వారం రోజుల్లో రికవరీ పూర్తి చేసి ప్రభుత్వానికి తిరిగి సొమ్ము జమ చేయాల్సి ఉంటుంది. కానీ ఆసరా పింఛన్ల పర్యవేక్షణపై జిల్లా స్థాయిలో సెర్ప్ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉన్నా రోజువారీగా ప్రత్యేకంగా అక్రమ పింఛన్ల సర్వేపై పర్యవేక్షణ జరపలేదన్న విమర్శలు వెలువడ్డాయి. దీంతో ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోలేదని సమాచారం. దాంతో ప్రభుత్వ సొమ్ములు తిరిగి రాబట్టటంలో రాష్ట్రంలోనే జిల్లా వెనుకబడి ఉంది.

రికవ'రీ'

గత శనివారమే రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులకు అక్రమ పింఛన్ జాబితాలను అందించి రికవరీ చర్యలు తీసుకోవాలని అధికరులు ఆదేశించటంతో ఇప్పటికే ఇతర జిల్లాలో 40శాతం మేరకు అక్రమ పింఛన్లు రికవరీ చేసినట్లు తెలుస్తోంది. కానీ ఖమ్మం జిల్లాలో మాత్రం సర్వే అనంతరం అక్రమ పింఛన్‌దారులకు కనీసం నోటీసులు కూడా జారీ జరగలేదని సమాచారం. ఖమ్మం జిల్లాలో 227 మంది రూ.1.6కోట్ల మేరకు ఇప్పటి వరకు అక్రమంగా పింఛన్లు పొందారు. వీరిలో ఖమ్మం జిల్లా కేంద్రంలోనే 139మంది ఉన్నారు. ఇతర ప్రాంతాలు, మండలాల్లో ఇద్దరు నుంచి పది మంది వరకు ఉన్నారు. అయితే మండల స్థాయిలో సర్వే పూర్తి చేసి 60శాతం మందికి షాకాజ్ నోటీసులు జారీ చేశారు. కానీ ఖమ్మం నగరంలో మాత్రం ఇప్పటి వరకు అక్రమంగా 'ఆసరా' పొందుతున్న వారిని గుర్తించలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన కార్యచరణ మేరకు కేవలం వారం రోజుల లోపుగానే అక్రమ పింఛన్‌దారుల నుంచి సొమ్ము రికవ్రీ చేయాలని ఆదేశాలిచ్చారు. ఇప్పటి వరకు ఖమ్మంనగరపాలక సంస్థలో నలుగురు, ఎర్రుపాలెంలో ఒక్కరు, కామేపల్లిలో ఒక్కరు మొత్తం ఆరుగురు నుంచి మాత్రమే రూ.3.5లక్షలు రికవరీ చేసినట్లు సమాచారం. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు పట్టించుకోకపోవటంతోనే ప్రభుత్వానికి తిరిగి రావాల్సిన రూ.1.5కోట్ల సొమ్ము వసూలులో వెనుకబడినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

మరో 90 అక్రమ పింఛన్లు వెలుగులోకి..

వైద్యఆరోగ్యశాఖ ద్వారా హెచ్ఐవీ, ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం చేయూత ఏఆర్‌టీ, ఫైలేరియా ఆసరా పింఛన్ పత్రాలను మంజూరు చేస్తోంది. వాటిని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు నేరుగా రాష్ట్ర స్థాయిలోని అధికారులకు పంపటంతో పింఛన్లు మంజూరవుతాయి. ఇతర పింఛన్లు మాత్రం పంచాయతీలు, ఎంపీడీవోల ద్వారా పరిశీలన చేసి మంజూరు చేస్తారు. అయితే సాధారణ పింఛన్లు పొందుతున్న వారిలో కొంతమంది హెచ్ఐవీ, ఫైలేరియా వ్యాధులకు గురి కావటంతో వారికి వైద్యఆరోగ్యశాఖ నుంచి నేరుగా రాష్ట్ర ప్రభుత్వానకి నివేదికలు వెళ్లటంతో అలా మరో 90మంది వరకు 2016నుంచి అక్రమంగా రెండు పింఛన్లు పొందుతున్నారు. ఈ విషయాలు '360డిగ్రీ' యాప్ ద్వారా బయటపడ్డాయి. దీంతో రెండు పింఛన్లు పొందుతున్న మరో 90మందికి ప్రభుత్వం పింఛన్లు నిలుపుదల చేసి వారి నుంచి రికవరీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ విషయాలపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ నురుద్దీన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పింఛన్‌ల పర్యవేక్షణ డీపీఎం స్థాయిలోని అధికారుల పర్యవేక్షణ చేస్తున్నారని సమాధానం దాట వేశారు.



ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

సింగరేణిని నిర్వీర్యం చేసే

కుట్రలను తిప్పికొట్టాలి

- కార్పొరేట్ శక్తులను తరిమేస్తేనే సింగరేణికి మనుగడ
- కేంద్రం దిగి రాకుంటే నిరవధిక సమ్మె తప్పదు
- వామపక్షాలు, కార్మికసంఘాల నేతలు
- బొగ్గుగనుల వేలాన్ని నిరసిస్తూ కొత్తగూడెం, ఖమ్మంలో ఆందోళనలు

6

కేయూ పాలక మండలిలో

ఉమ్మడి జిల్లాకు మొండిచేయి

- వరంగల్ నుంచే మొత్తం 9 మంది సభ్యుల నియామకం

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 5: తెలంగాణలో రెండో అతి యూనివర్సిటీ అయిన కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అధికారులు మొండిచేయి చూపారు. గురువారం నూతనంగా కేయూ పాలకమండలి నియమించగా అందులో ఖమ్మం జిల్లా నుంచి ఒక్కరికి కూడా చోటు దక్కకపోవటం గమనార్హం. వరంగల్ జిల్లాకు అధిక ప్రాధాన్య కల్పించటంలో ఉన్నత విద్యాశాఖ అధికారుల అత్యుత్సాహం ప్రదర్శించి ఖమ్మం జిల్లాకు పాలక మండలిలో ప్రాతినిధ్యం లేకుండా చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తం 9 మంది సభ్యుల పాలక మండలిలో అందరూ వరంగల్ జిల్లాకు చెందిన వారినే నియమించినట్లు అసోసియేషన్ ఆఫ్ కేయూ డాక్టరేట్స్ ప్రెసిడెంట్ కొల్లు నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజీవ్‌రాజ్ తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు వెంటనే స్పందించి నూతన పాలక మండలిలో ఖమ్మం జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించాలని జిల్లా విద్యావంతులు, మేధావులు, ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

దారి ఇలా.. బడికి ఎలా..?



రైతులు నిర్మించుకున్న మట్టి రహదారిపై విద్యార్థుల నడక

కరకగూడెం మండలంలోని వలస ఆదివాసీ గ్రామం అయిన అశ్వాపురంపాడు వలస ఆదివాసీ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయక పోవడంతో విద్యార్థులు అడవీ మార్గంలో మూడు కిలో మీటర్లు చెరువులు, కుంటలు దాటుకుంటు మోతే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళుతున్నారు. చిన్నారులు అడవీ మార్గంలో నడక తప్పడం లేదు. చెరువు అలుగుపై నుంచి కట్టపై నుంచి వచ్చే సమయంలో కాలుజారితే అంతే సంగతులు.

- కరకగూడెం

భద్రాచలం డిగ్రీ కళాశాలకు మహర్దశ

- పది రోజుల్లో రానున్న స్వయం ప్రతిపత్తి ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లాలో రెండో కళాశాలగా గుర్తింపు



భద్రాచలం, జూలై 5: ఏజెన్సీ డివిజన్ కేంద్రంలోని భద్రాద్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ పట్టనుంది. ఈ కళాశాలకు స్వయంప్రతిపత్తిని కల్పించేందుకు రంగం సిద్ధమైంది. రాబోయే పది రోజుల్లో ఇందుకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ కళాశాలకు స్వయం ప్రతిపత్తి లభిస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తొలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా నిలవనుండగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండో ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా గుర్తింపు పొందనుంది. గత మూడు దశాబ్దాలుగా వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యనందించిన ఈ కళాశాల ప్రస్తుతం జాతీయస్థాయి గుర్తింపు సంస్థ నాక్‌చే బీ++ గ్రేడ్ దక్కించుకుంది. ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో డిగ్రీ, పీజీ కోర్సుల్లో విద్యనందిస్తున్నారు. విద్యార్థులకు డిజిటల్ క్లాసులతో పాటు స్మార్ట్ బోర్డుల ద్వారా విద్యాబోధన చేస్తున్నారు. అంతే కాదు ఈ కళాశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. కళాశాలలో బోధన సాగించే అధ్యాపకులు పీహెచ్‌డీ, ఎన్ఈటీ, సెట్ అర్హతలు సాధించిన వారు ఉండటం విశేషం. కంప్యూటర్ డిజిటల్ ల్యాబ్ సౌకర్యం, అత్యాధునిక జిమ్, క్రీడా సౌకర్యాలు ఈ కళాశాలలో అందుబాటులో ఉన్నాయి.

వామ్మో.. ఎన్నెస్పీ వాక్‌వే

- రూ. కోట్లు వెచ్చించినా నిర్వహణ శూన్యం
- నడక దారిలో రాళ్లు, గుంతలు
- దారి వెంట మద్యం సీసాలు



గుంతలతో ఉన్న నడకదారి

ఖమ్మంకార్పొరేషన్, జూలై 5: జిల్లా కేంద్రంలో నిర్మించిన ఎన్నెస్పీ వాక్‌వేలు కాంట్రాక్టర్లకు కాసులు కురిపించాయి. ప్రస్తుతం వాటి నిర్వహణ సరిగా లేకపోవటంతో పాటు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. వాక్‌వేలకు మరమ్మతులు చేపట్టాలని టెండర్లు పిలిచి, నెలలు గుడుస్తున్నా తట్టెడు మట్టి కూడా పోయలేదని, చెట్ల పొదలను తొలగించలేదనే విమర్శలు ఉన్నాయి. వాకింగ్‌కు వచ్చిన వారికి ట్రాక్‌పై ఉన్న రాళ్లు, పెరిగిన పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. చెట్లు గుబురుగా పెరిగి, దారి మూసుకు పోవటంతో వాకింగ్ చేయలేక పోతున్నారు. వర్షం పడితే వాకింగ్ ట్రాక్‌పైనే నీళ్లు నిలుస్తూ, బురదలోనే వాకింగ్ చేయాల్సిఉంటుంది. ఇక వాక్‌వేలకు ఫెన్సింగ్ సరిగా లేకపోవటంతో పందులు సంచరిస్తున్నాయి.

రూ.3.50కోట్ల వ్యయం..

ఎన్నెస్పీ కాలువ పక్కన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని గత ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధి చొరవతో రూ.3.50కోట్ల వ్యయంతో ఎన్నెస్పీ వాక్‌వేలను ఏర్పాటు చేశారు. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి,వాక్‌వేలు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వాకర్స్ విశ్రాంతి తీసుకునేందుకు బల్లలు, ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేశారు. ఇల్లెందు రోడ్‌లోని ఎన్నెస్పీ కాలువకు ఇరువైపులా ఎన్నెస్పీ వాక్‌వేలను నిర్మించారు.

నిర్వహణ అధ్వానం

కోట్ల రూపాయలు వెచ్చించి, ఒక కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేలా ఎన్నెస్పీ వాక్‌వేలు నిర్మించినా, తరువాత వాటి నిర్వహణను పట్టించుకోలేదు. వాకింగ్ చేసే ట్రాక్ రాళ్లు తేలిఉన్నా మరమ్మతులు చేయలేదు. అంతేకాకుండా వాక్‌వేలలో చెట్లు పెరిగి, అడవిని తలపిస్తున్నా శుభ్రం చేయటం లేదు. దీంతో వాకింగ్‌ట్రాక్ పెరిగిన చెట్లతో మూసుకుపోయింది. దీంతో అక్కడ వాకింగ్ చేయలేక పోతున్నారు. వాక్‌వేల చుట్టూ వేసిన ఫెన్సింగ్‌కు రంధ్రాలు పడ్డాయి. ఫెన్సింగ్‌ను తొలగించి, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. కాగా వేణుగోపాల్‌నగర్ ప్రాంతంలో వాక్‌వే మరమ్మతులకు రూ.3లక్షలు కేటాయించి, టెండర్లు నిర్వహించి నెలలకాలం గుడుస్తున్నా ఇంతవరకు మట్టి పోయటం, పెరిగిన చెట్లను తొలగించటం చేయలేదు. దీంతో సాయంత్రం వేళ వాకింగ్ చేయాలంటేనే భయపడే పరిస్థితి. ఇప్పటికైనా నగరపాలకసంస్థ అధికారులు ఎన్నెస్పీ వాక్‌వేల నిర్వహణపై దృష్టి పెట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.



వాక్‌వేలో మద్యం సీసాలు



పందుల స్వైర విహారం



వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శిస్తున్న కలెక్టర్

గుండాల అభివృద్ధి నా బాధ్యత

- రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలి
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

గుండాల, జూలై 5: ఆకాంక్ష ప్రాంతంగా ఎంపికైన గుండాల మండల అభివృద్ధి తన బాధ్యత అని, మండలాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన ప్రభుత్వ ఆసుపత్రిలో నీతిఆయోగ్‌లో భాగంగా సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి అప్‌గ్రేడ్ అయ్యేలా జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు(ఎన్‌క్యూఎఎస్)లో పెడతామని, దీని ద్వారా అన్ని రకాల వైద్య సదుపాయాలకు యేటా నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. రైతులకు మట్టి పరీక్షల కార్డులు, స్వయం శక్తి సంఘాలకు నిధులు ఇవ్వాలని అన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం ఎంపీపీ ముక్తి సత్యం విద్య, వైద్యం, రహదారుల సమస్యలను వివరించారు. స్పందించిన కలెక్టర్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సంపూర్ణతా అభియాన్ కార్యక్రమంపై పాఠశాలల్లో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు ప్రశంస పత్రాలతో పాటు షీల్డ్ అందించారు. కాచనపల్లి క్రీడా పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గుండాలలో విద్యాశాఖ, అంగన్‌వాడీ, మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించి అభినందించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ పీడీ విద్యాచందన, డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్, డీఈవో వెంకటేశ్వరచారి, సెక్టోరియల్ అధికారులు సతీష్, నాగరాజశేఖర్, సైదులు జడ్పీటీసీ సభ్యురాలు రామక్క, తహసీల్దార్ ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, హాజరైన జిల్లా అధికారులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచాలి

- ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి
- ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 5: పభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలి... ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కోరారు. ఉపాధ్యాయులు దీనికోసం ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల విద్యాధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు కృషిచేయాలన్నారు. విద్యార్థుల హాజరుపై దృష్టి పెట్టాలన్నారు. షెడ్యూల్ ప్రకారం పాఠశాలల్లోని విద్యార్థులకు బేస్ లైన్ పరీక్ష నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతిరోజు హాజరయ్యేలా, సమయానికి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీటీఎంలు బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ కె. భూలక్ష్మి, డీసీఈబీ కార్యదర్శి జి. నారాయణ, ఏఎంఓ రవికుమార్, ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్. రామకృష్ణ, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి విజయానికి నాంది కావాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 5: ఓటమి విజయానికి నాంది కావాలని ఓటమికి నిరుత్సాహపడొద్దని, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ సూచించారు. శుక్రవారం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ, యువకులతో మాట్లాడి వారి సమస్యలను సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు సన్నద్ధం కావాల్సిన విధానంపై అవగాహన కలిపించారు. ఈకార్యక్రమంలో లైబ్రేరియన్ నాగన్న సిబ్బంది పాల్గొన్నారు.



గ్రంథాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వ పరిధిలోకి కేవీసీఎం విద్యాసంస్థలు

- ఫలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవ
- రూ.కోట్ల విలువైన 14.03 ఎకరాల భూమి ప్రభుత్వ పరం
- రూ.కోట్ల విలువైన భవనాలు కూడా



కొండబోలు వెంకయ్యచౌదరి మెమోరియల్ విద్యాసంస్థల భవనం

వైరా, జూలై 5: ఖమ్మం జిల్లా వైరాలో రూ.కోట్ల విలువైన కొండబోలు వెంకయ్యచౌదరి మెమోరియల్ విద్యాసంస్థలకు చెందిన స్థలం, భవనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. విద్యాసంస్థలకు చెందిన స్థలం, భవనాలు ప్రభుత్వానికి స్వాధీనం చేసేందుకు వైరాకు చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చూపిన చొరవ ఫలించింది. భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ మేరకు ఆ విద్యాసంస్థల చైర్మన్ కొండబోలు రవికుమార్ ఈ ఆస్తులను గురువారం ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. 'విద్య కోసం వితరణ, రూ.30కోట్ల ఆస్తులను ప్రభుత్వానికి ఇచ్చేందుకు వైరా కేవీసీఎం ట్రస్టు సిద్ధమని' గతనెల 11వతేదీన 'ఆంధ్రజ్యోతి'లో ఓ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.

స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో వైరా ప్రాంతంలో సామాజిక స్పృహ కల్గిన వ్యక్తులు కలిసి తమ ప్రాంతంలో విద్యావసరాల కోసం భూములను సమీకరించారు. ఆభూముల్లోనే 1992లో కేవీసీఎం డిగ్రీ కాలేజీని ఏర్పాటుచేశారు. వైరాలో విద్యాభివృద్ధి కోసం పాటుపడిన వైరా మండలం సోమవరం గ్రామానికి చెందిన మధిర తొలి ఎమ్మెల్యే(1952) కొండబోలు వెంకయ్యచౌదరి పేరిట డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేశారు. 1953 ప్రాంతంలోని ఆంధ్ర నికేతన్ కమిటీ పేరుతో ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. ఆతర్వాత ఉన్నత పాఠశాలను ప్రారంభించి 1969వరకు నిర్వహించారు. అనంతరం ఈ పాఠశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇదే క్రమంలో 1992లో అప్పటి ఎమ్మెల్యే బోడేపూడి వెంకటేశ్వరరావు చొరవతో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు ఇతర గ్రామ ప్రముఖుల తోడ్పాటుతో కేవీసీఎం డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేశారు.

అమెరికాలో ఉంటున్న వెంకయ్యచౌదరి కుమారులు రవికుమార్, సురేష్‌బాబు ఇతర కుటుంబసభ్యులు, ఎన్నారైల తోడ్పాటుతో కేవీసీఎం డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. 1992నుంచి 2009వరకు డిగ్రీ కళాశాల కొనసాగింది. ఆతర్వాత అనివార్యకారణాలతో డిగ్రీ కళాశాల మూతపడింది. 2011లో కేవీసీఎం ఎన్నారై పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించి 2015వరకు ఈ కళాశాల నడిచింది. ఆతర్వాత ఈ పాలిటెక్నిక్ కళాశాల కూడా మూతపడింది. 9ఏళ్ల నుంచి కేవీసీఎంకు చెందిన భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి.

షరతులకు అంగీకారం...

ఈ ఏడాది మార్చి ఐదున కేవీసీఎం ట్రస్టు చైర్మన్ కొండబోలు రవికుమార్ సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ ఆస్తులను విద్య కార్యక్రమాలకు వినియోగించుకొనేందుకు అప్పగించాలని నిర్ణయించారు. ఆ ఆస్తులను స్వాధీనం చేసుకొనేందుకుగానూ ప్రభుత్వానికి కొన్ని షరతులు విధించారు. వాటి ప్రకారం ఈ ఆస్తుల ప్రాంగణంలో ఏ సంస్థలు స్థాపించిన కొండబోలు వెంకయ్యచౌదరి పేరును కొనసాగించాలని, ఇక్కడ ఏర్పాటుచేసిన కొండబోలు వెంకయ్యచౌదరి విగ్రహాన్ని యథాస్థానంలో ఉంచాలని, ముగ్గురు సిబ్బందిని ప్రభుత్వం విధుల్లోకి తీసుకోవాలని షరతులు విధించారు. వీటికి ప్రభుత్వం అంగీకారం తెలిపింది,

14.03ఎకరాలు స్వాధీనం

ఈ కేవీసీఎం సొసైటీకి చెందిన సర్వేనెంబర్ 72ఎలో 13.24ఎకరాలు, సర్వేనెంబర్ 74ఎలో 0.19ఎకరాలు మొత్తం 14.03 ఎకరాల స్థలాన్ని, భవనాలను స్వాధీనం చేసుకున్నారు. వైరా గిర్దావర్ వెంకటేశ్వరరావు పంచనామా నిర్వహించారు. తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు ఆస్తుల స్వాధీనానికి సంబంధించిన ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. దాదాపు రూ.30కోట్ల ఆస్తులు ప్రభుత్వానికి లభించాయి. ట్రస్టు తీర్మానం మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకొని కొండబోలు రవితో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టారు. ఇక్కడ ప్రభుత్వం సమీకృత అంతర్జాతీయ విద్యాసంస్థలను ఏర్పాటుచేసేందుకు సిద్ధమవుతుంది. అంతకంటే ముందుగా అవసరమైతే తాత్కాలికంగా వందపడకల ఆసుపత్రిని నిర్వహించాలని భావిస్తుంది. ఇప్పటికే ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ స్థలాలను పరిశీలించి భట్టి విక్రమార్కకు నివేదించారు.

మరుగుదొడ్ల బిల్లులు హాంఫట్?

- 2018లో కేంద్ర ప్రభుత్వం వీడబ్ల్యూఎస్టీ ఖాతాలు ఏర్పాటు
- ఆ ఖాతాలో ఉన్న రూ. 2లక్షలు నగదు మాయం
- పంచాయతీ కార్యదర్శి సహాయంతో సర్పంచ్ స్వాహ
- కామేపల్లి మండలం నెమలిపురి గ్రామంలో ఘటన

కామేపల్లి, జూలై 5: స్వచ్ఛ్‌భారత్‌లో భాగంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం మరుగు దొడ్ల నిర్మాణాలకు నగదు ఇస్తూ ప్రోత్సహించింది. ఆ నగదును కొంత మంది అక్రమార్కులు కాజేసి లబ్ధిదారుల నోరు కొట్టారు. ఈ సంఘటన కామేపల్లి మండలం నెమలిపురి గ్రామంలో చోటు చేసుకుంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం 2018వ సంవత్సరంలో మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, ఒక్కో నిర్మాణానికి రూ.12వేలు ప్రోత్సాహం అందజేసింది. వీరికి ప్రతి పంచాయతీలో వీడబ్ల్యూఎస్టీ ఖాతాలను తెరిచి వాటిలో నగదును జమ చేశారు. ఎవరైతే నిర్మాణం పూర్తిగా చేపడితే ఆఖాతా నుంచి లబ్ధిదారుడి ఖాతాలోకి జమ చేయాలి. కానీ ఆసమయంలో కామేపల్లి మండలం గోవింద్రాలలో గ్రామంలో మరుగుదొడ్లు నిధులు స్వాహ చేశారని అప్పటి ఎంపీడీవోను, పంచాయతీ కార్యదర్శిని జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి ఆఖాతాలను ఫ్రీజింగ్‌లో ఉంచారు.

నెమలిపూరి గ్రామంలో 17మరుగుదొడ్లు నిర్మాంచారు. వారికి వీడబ్ల్యూఎస్టీ ఖాతాలోకి రూ.2లక్షల నగదు జమ అయింది. ఆఖాతా ఫ్రీజింగ్‌లో ఉండడడంతో నగదు బదిలీ చేయలేదు. అయితే ఇటీవల సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్న సమయంలో పంచాయతీ కార్యదర్శి సహకారంతో ఆ గ్రామ సర్పంచ్ ఆ నిధులను డ్రా చేసి కాజేశారు. విషయం తెలుసుకున్న లబ్ధిదారులు గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం కామేపల్లి ఎంపీడీవో రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా నాలుగు నెలల క్రితమే ఇక్కడికి వచ్చానని వివరాలు తెలుసుకొని విచారణ చేపడతానని తెలిపారు.



నెమలిపురి పంచాయతీ ఎదుట ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

ఖమ్మం కలెక్టర్ పొలంబాట

- బూట్లు విప్పి గట్లపై నడిచి.. రైతులతో భేటీ
- సాగులో సాధకబాధకాలపై ఆరా..

తల్లాడ, జూలై 5: వానాకాలం సాగు పనులు ముమ్మరమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ పరిస్థితులు, రైతుల కష్ట సుఖాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం పొలం బాటపట్టారు. తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో వరినాట్లు, వరి వెదజల్లే పద్ధతిని కలెక్టర్ స్వయంగా తిలకించారు. బూట్లు విప్పి గట్లపై నడిచారు. వరిపొలంలో దిగి ఆయన కూడా వడ్లను వెదజల్లారు. పొలం వద్దనే నేలపై కూర్చుని వ్యవసాయంలో వచ్చే లాభనష్టాలను, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. నారుమడి నుంచి పంట కోసి అమ్మే వరకు ప్రతిదశలో రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉండాలని, వారికి సలహాలు, సూచనలు ఇవ్వాలని, ప్రతిరైతు అధిక లాభం పొందేలా అధికారులు చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులను కలెక్టర్ ఆదేశించారు. తెగుళ్లనివారణకు వాడుతున్న మందులను అధిక దిగబడులకు వినియోగించే ఎరువులు గురించి కూడా కలెక్టర్ ఈ సందర్భంగా రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ధాన్యం అమ్మేటప్పుడు మిల్లర్లు ఎలా చెల్లిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన ధాన్యం ఉత్పత్తి చేయాలని, మంచి గిట్టుబాటు ధర పొందాలని తెలిపారు. వ్యవసాయం రంగంలో వస్తున్న నూతన పద్ధతులు రైతులు తెలుసుకుని సాగుచేయాలని, నాణ్యమైన విత్తనాలు వినియోగించాలని కలెక్టర్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయనిర్మల, ఏడీఏ యు.నర్సింహారావు, ఏవో ఎండీ.తాజుద్దీన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సింగరేణిని నిర్వీర్యం చేసే కుట్రలను తిప్పికొట్టాలి

కొత్తగూడెం/ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు తలమానికండగా ఉన్న సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను ఉద్యమాల ద్వారా తిప్పికొట్టి సంస్థను పరిరక్షించుకోవాలని వామపక్షాలు, కార్మికసంఘాల నేతలు పిలుపునిచ్చారు. బొగ్గుబ్లాక్‌ల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుని సింగరేణి సంస్థకు బేషరత్తుగా అప్పగించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు, అనుబంధ కార్మికసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెం, ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయాలనుముట్టడించి ధర్నా చేశారు. కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం రీజియన్ పరిధిలోని కొత్తగూడెం, కార్పొరేట్, మణుగూరు, ఇల్లెందు ఏరియాల నుంచి తరలివచ్చిన కార్మికులు, పార్టీల నాయకులు వందలాదిగా తరలివచ్చి ధర్నాలో పాల్గొన్నారు. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్ పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, ఎంఎల్ పార్టీ జిల్లా నాయకులు ఆవునూరి మధు, ఏఐటీయూసీ నాయకులు మిర్యాల రంగయ్య, సీఐటీయూ నాయకులు మందా నర్సింహారావు, ఇఫ్టూ నాయకులు యాకూబ్ షావలి, రాంసింగ్‌లు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కొల్లగొట్టి కార్పోరేట్ పెట్టుబడిదారులకు దారాదత్తం చేసే కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించిందని, తాజాగా బొగ్గు పరిశ్రమలను ప్రైవేట్‌పరం చేసే నిర్ణయం తీసుకుందన్నారు. కేంద్రం నిర్ణయంతో తెలంగాణలోని బొగ్గుబ్లాకులు అదాని, అంబాని లాంటి కార్పోరేట్ శక్తుల పరం కానున్నాయని, వీరిని తెలంగాణలో అడుగుపెట్టనీయబోమని హెచ్చరించారు. సింగరేణి సంస్థను పరిరక్షించుకునేందుకు భవిష్యత్‌లో జరిగే బచావో ఉద్యమం ప్రజాఉద్యమంగా మారుస్తామన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, డి. శంకర్, దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, జి. వీరస్వామి, వై. రాంగోపాల్, వి. మల్లిఖార్జున్‌రావు, రమణ హర్షి, దస్రు, హనుమంతరావు, నగేష్, రాములు, గట్టయ్య, ఐలయ్య, సీపీఎం, సీఐటీయూ నాయకులు బి. మధు, కె. బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, నబీ, వీరన్న, సత్య, కొండబోయిన వెంకటేశ్వర్లు, లక్ష్మి, వెంకటమ్మ, పద్మ, విజయగిరి శ్రీనివాస్, భూక్య రమేష్, ఎంఎల్ పార్టీలు, ఇఫ్టూ సంఘాల నాయకులు గౌని నాగేశ్వరరావు, మధుసూదన్ రెడ్డి, వెంకటమ్మ, ముత్యాల సత్యనారాయణ, వైఎస్. రెడ్డి, మోత్కూరి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట వామపక్షాల ధర్నా

బొగ్గు బావుల వేలంపై వామపక్ష రాజకీయ పార్టీలైన సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీలు శుక్రవారం ఖమ్మం సమీకృత కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు మాట్లాడుతూ ఇప్పటికే అనేక ప్రభుత్వ రంగ సంస్థలు, కంపెనీలను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అందించేందుకు బొగ్గు బావులను ప్రైవేటీకరణ చేస్తోందని ఆరోపించారు. ఎన్ని పోరాటాలు చేసైనా బొగ్గు వేలాన్ని అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ జిల్లా కమిటీ కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, పోటు ప్రసాద్, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్, వామపక్ష పార్టీల నాయకులు మహ్మద్ మౌలానా, దండి సురేశ్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా శ్రీకాంత్ తదితరులు పాలొన్నారు.

వర్షాల రాకతో సాగు కళకళ

» భూమికి పచ్చదనాన్ని పంచుతున్న పత్తి, పెసర

ఖమ్మం, జూలై5(ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలో గత వారం రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు వానాకాలం సాగుకు ఊతమిస్తున్నాయి. వేసిన పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. పుడమి తల్లి పచ్చదనంతో మురిసిపోతుంది. కురుస్తున్నవర్షాలు పంటలకు ప్రాణం పోస్తున్నాయి. పత్తి, పెసర, మొక్కజొన్న, వరి నారుమళ్లు ఇలా వానాకాలం సాగు ఆరంభంలో వేసిన పొలాలన్నీ పచ్చదనంతో మెరుస్తున్నాయి. జూన్‌నెలలో కురవాల్సిన వర్షాలు కురవడం, జూలైలో కూడా పంటలకు ప్రాణం పోసే విధంగా పడుతుండడంతో రైతులు ఆసక్తిగా వ్యవసాయాన్ని సాగు చేసుకుంటున్నారు. పత్తి చేలల్లో పైపాట్లు, గుంటకలు తోలడం ఎరువులు వేయడం, కలుపులు తీయడం బిజీబిజీగా ఉన్నారు. ఖమ్మం జిల్లా పరిధిలో జూన్‌లో 124.8మి.మీ.సగటు వర్షపాతం కాగా 198.8మిమీ. వర్షపాతం కురిసింది. జులై లో కూడా ప్రతిరోజు వర్షపాతం కురుస్తూనే ఉంది. గురవారం రాత్రి జిల్లాలో 27.7 మి.మీ.సగటు వర్షపాతం నమోదు


పత్తిపొలాల్లో కలుపు తీస్తున్న దృశ్యం


కళకళలాడుతున్న పెసర పంట

కాగా పలు మండలాల్లో భారీగానే వర్షం పడింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పత్తి, వరినారుమళ్లు, పెసర, కంది, నువ్వులు, మొక్కజొన్న వంటి పంటలకు మేలు చేకూరుస్తున్నాయి. జిల్లాలో పత్తి 201834 ఎకరాలకు గాను 181,723 ఎకరాల్లో వేశారు. వరినారుమళ్లువరినాటు వెదజల్లే పద్ధతిలో మొత్తం జిల్లాలో ఇప్పటి వరకు 26,751 ఎకరాలు, మొక్కజొన్న 1221 ఎకరాలు, పెసర 11017 ఎకరాలలో వేశారు. మొత్తంమీద జిల్లాలో 2లక్షల54 ఎకరాల్లో రైతులు పలు రకాల పంటలు వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు పత్తి పంటలో పైపాట్లు, గుంటక తోలడం, కలుపు తీయడం, ఎరువులు వేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో రైతులు పొలాలకు ఎరువులు వేయడం, కలుపుతీయడంతో సందడి నెలకొంది. శుక్రవారం జిల్లాలో 27.7మి.మీ. వర్షపాతం నమోదుకాగా రఘునాధపాలెంలో 20.0మిమీ.తిరుమలాయపాలెం35.2మిమీ., కూసుమంచి 25.4మిమీ., ఖమ్మంఅర్బన్ 25.6మిమీ., ఏన్కూరు 47.2మిమీ. కల్లూరు 48.6మిమీ., పెనుబల్లి 66.8మిమీ., సత్తుపల్లి 69.6మిమీ., వేంసూరులో59.4మిమీ. వర్షపాతం నమోదయింది. జిల్లాలో కురుస్తున్న వర్షాలు సాగుకు అనుకూలంగా ఉన్నాచెరువుల, వాగులు, ప్రాజెక్టులో నీరు నిండక వెలవెలబోతున్నాయి.

రంగు మారిన రైతు వేదిక

» గత పాలకుల గుర్తుల చెరిపివేత » ఖమ్మం జిల్లా వీ.వీ పాలెం రైతువేదికకు కొత్త రంగులు

» సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల పోటోల ఏర్పాటు » జిల్లా వ్యాప్తంగా ముందుకు వస్తున్న పాలకవర్గాలు

రఘునాథపాలెం, జూలై 5: ఎన్నికల సమయంలో పోలింగ్ రోజు మినహా గ్రామీణ ప్రాంతంలోని రైతులకు రాజకీయాలు పట్టింపు ఉండదు. పోలింగ్ మరుసటి రోజు నుంచి కుల మతాలకు అతీతంగా రైతులు, రైతు కూలీలు కలిసిమెలిసి ఉంటారు. బాబాయి, మామయ్య అంటూ పలకరించుకుంటారు. అటువంటి గ్రామీణ ప్రాంతాల్లో గత ప్రభుత్వం నిర్మాణం చేసిన రైతు వేదికలకు రాజకీయ రంగు వేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతువేదికలకు గులాబీ 3డీ రంగులు, హంగులతో రూ.లక్షల వెచ్చించారు. అయితే ప్రభుత్వం మారడంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రంగులను మార్చేస్తోంది. ముందుగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం నియోజకవర్గంలోని రైతు వేదికలకు గులాబీ రంగులు తొలగించి కొత్త రంగులు వేస్తున్నారు. మండలంలోని వీ వెంకటాయపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు ఆధ్వర్యంలో రైతు వేదికలకు రాజకీయ రంగలను తొలగించి సొంత డబ్బులతో రైతులు, కూలీలకు ఇష్టంగా ఉండే వ్యవసాయ ప్రాధాన్యతను చాటిచెప్పే ఆకుపచ్చ రంగులను వేశారు. ఒక వైపు ముఖ్యమంత్రి, మరో వైపు వ్యవసాయశాఖ మంత్రి ఫోటోలతో పాటుగా వ్యవసాయ రంగానికి, రైతులకు కావాల్సిన సూచనలు చేస్తూ ఆదర్శవంతమైన రైతు వేదికలను ఏర్పాటు చేశారు. ఇలా వీవీపాలెంలో రైతు వేదిక రంగులు మారడంతో జిల్లా వ్యాప్తంగా రంగులు మార్చేందుకు పాలకవర్గాలు ముందుకొస్తున్నాయి.



ఖమ్మం జిల్లా వీ వెంకటాయపాలెంలో కొత్త రంగులతో రైతు వేదిక

ఇందిరా డెయిరీ ద్వారా

20వేల మందికి ప్రయోజనం

● ఖమ్మం డీఆర్‌డీవో సన్యాసయ్య

బోనకల్, జూలై 5: ఇందిరా డెయిరీ ద్వారా మధిర నియోజకవర్గ వ్యాప్తంగా 20 వేల మందికి లబ్ధి చేకూరనుందని డీఆర్‌డీవో ఆర్. సన్యాసయ్య తెలిపారు. బోనకల్‌లో శుక్రవారం ఇందిరా డెయిరీ నిర్మాణా స్థలాన్ని ఆయన పరిశీలించారు. ప్రస్తుతం ఇందిరా డెయిరీ నిర్మాణం చేపట్టనున్న భూమిలో రైతులు సాగు చేస్తున్న పంటలను చూసి తదుపరి పంటలను సాగు చేపట్టకుండా రైతులతో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఐకేపీ కార్యాలయంలో పశు సంవర్ధక, ఐకేపీ శాఖాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ నియోజవర్గంలోని ఐదు మండలాల్లో పాడి రైతుల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాల ఉత్పత్తిదారులకు సంబంధించి పాడి గేదేలు, ఆవులు, భూముల వివరాలను సేకరించాలని కోరారు. పాలను విక్రయిస్తున్న వారి వివరాలను కూడా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బోనకల్ తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో ఎల్. రాజు, ఏపీఎం పద్మలత, ఏపీవో కృష్ణ కుమారి, ఆర్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు

మధిరలో ఐటీహబ్ కోసం

భవనాల పరిశీలన

మధిరటౌన్, జూలై5: మధిరకు ఇటీవల ఐటీహబ్ మంజూరు అవడంతో అందుకు అనుగుణంగా ఐటీహబ్‌ను తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు మధిర తహసీల్దార్ వెంకటేశ్వర్లు శుక్రవారం మధిరలో పలు భవనాలను పరిశీలించారు. మధిరకు ఐటీహబ్ మంజూరైనట్లు ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర పర్యటన సందర్భంగా ప్రకటించడంతో పాటు అందుకు అవసరమైన బిల్డింగ్ నిర్మాణం కోసం పట్టణంలో ఉన్న ఇరిగేషన్ శాఖకు చెందిన రెండు ఎకరాల స్థలాన్ని కూడా ఎంపిక చేసినట్లు తెలిపారు. పక్కా భవనం పూర్తి అయ్యేలోపు ఐటీహబ్‌ను వెంటనే ఏర్పాటు చేసేందుకు తాత్కాలిక వసతి ఏర్పాటు కోసం తగిన ప్రయివేటు భవనాలను పరిశీలించాలని, ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మధిర తహసీల్దార్ పలు భవనాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ వేణు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


భవనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు, నాయకులు

'కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలి'

» కొనసాగుతున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె » సీపీఎం, ఎంఎల్ (మాస్‌లైన్), బీఆర్ఎస్ పార్టీల మద్దతు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 5: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ యంల్ (మాస్ లైన్) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. సీఐటీయూ, ఇఫ్టూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ నిరవధిక సమ్మె రెండో రోజు కొనసాగింది. సమ్మెకు సీపీఎం, సీపీఐ ఎంఎల్ (మాస్ లైన్) పార్టీలు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని జీతంతో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్ కుమార్ కార్మికుల పరిస్థితిపై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డీఎంఈ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి కార్మికులకు మూడు నెలల వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకున్నట్లు కార్మికుల పక్షాన నేతలతో చర్చించారు. కానీ వేతనాలు ఇస్తేనే విధుల్లోకి చేరతామని కార్మికులు భీష్మించుకున్నారు. దీంతో శనివారం నాడు కార్మికులకు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకున్నట్లు ఆస్పత్రి అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, సీపీఐ యం ల్(మాస్ లైన్) డివిజన్ కార్యదర్శి జాన్సి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి జి.రామయ్య, శ్రీను, వెంకటరమణ, మమత, అంబేడ్కర్, అంజలి, సీతారాములు, సత్యవతి, పద్మ, ఉపేందర్, అశోక్, జగదీష్, నాగరాజు పాల్గొన్నారు.


కార్మికులకు మద్దతుగా మాట్లాడుతున్న నాయకులు

ఫిట్స్‌తో పొలంలోనే ప్రాణాలొదిలిన రైతు

● భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలంలో ఘటన

దుమ్ముగూడెం, జూలై 5: వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లిన రైతు అక్కడే ప్రాణాలొదిలిన సంఘటన శుక్రవారం భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం అంజుబాక గిరిజన గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఆదివాసీ రైతు మడకం ఆదినారాయణ(25) 4వ తేదీ సాయంత్రం నాగలిని ఇంటికి మోసుకొచ్చేందుకు పోడు సాగు చేస్తున్న పత్తి చేను వద్దకు వెళ్లాడు. అయితే అతడు శుక్రవారం ఉదయం వరకూ ఇంటికి రాకపోవడంతో అతడికి కోసం వెతికిన కుటుంబ సభ్యులకు పొలంలో ఆదినారాయణ మృతదేహం కనిపించింది. నాగలి భుజాన వేసుకొని ఇంటికి బయల్దేరిన క్రమంలో ఫిట్స్ వచ్చి కింద పడి మృతిచెంది ఉంటాడని వారు భావిస్తున్నారు. ఒక ఎకరం పోడు భూమితో కుటుంబాన్ని పోషిస్తున్న ఆదినారాయణ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. అతడికి భార్య, ముగ్గురు చిన్న పిల్లలున్నారు.

గిరిజనుల సమస్యలపై వినతి


మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న భిక్షమయ్య

అశ్వాపురం, జూలై 5: మండలంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో మంత్రి ధనసరి అనసూయకు వినతి పత్రం అందజేశారు. గొందిగూడెం ఇసుకవాగుపై వంతెన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని వివరించారు. వెంకటాపురం-మామిళ్లవాయి రహదారి నిర్మాణానికి అటవీ అనుమతులు ఇప్పించాలని మంత్రికి విన్నవించగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు భిక్షమయ్య తెలిపారు.

వ్యక్తిపై దాడి: పోలీసులకు ఫిర్యాదు

తల్లాడ, జూలై 5: బైక్‌లో నుంచి పెట్రోల్ తీశాడనే కారణంతో అన్నారుగూడెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గొడ్ల కాటయ్యపై అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి బాబూరావు శుక్రవారం దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు ఈమేరకు ఎస్ఐ కొండల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గేటుకారేపల్లిలో దెందులూరి ఎమ్మెల్యే చింతమనేని పర్యటన


చింతిమనేని పుష్పగుచ్ఛం అందజేస్తున్న పిచ్చయ్య

కారేపల్లి, జూలై5: ఆంధ్రప్రదేశ్ టీడీపీ నాయకుడు దెందులూరి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శక్రవారం మండల పరిధిలోని గేటుకారేపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయనాయకులు తోటకూరి పిచ్చయ్య ఇంటికి ఆయన వచ్చారు. ఈసందర్భంగా పిచ్చయ్యతో స్థానిక రాజకీయాలను అడిగితెలుసుకున్నారు.

గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో

సీడబ్ల్యూసీ బృందం పర్యటన


గోదావరి నదిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం అధికారులు

భద్రాచలం, జూలై 5: జిల్లాలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో శుక్రవారం కేంద్ర జలవనరుల సంఘం అధికారులు పర్యటించారు. సీడబ్ల్యూసీ ఈఈ ఫ్రాంక్లిన్, భద్రాచలం ఎస్‌డీఈ కొప్పుల పృధ్వీరాజ్, జేఈ సుమంత్‌రెడ్డిలు నదీ తీరాన్ని పరిశీలించారు. అదేవిధంగా కిన్నెరసాని, ముర్రేడువాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ ఈఈ ఫ్రాంక్లిన్ మాట్లాడుతూ రాబోయే వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడానికే పర్యటించినట్లు తెలిపారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద తీవ్రతను ముందుగానే అంచనా వేసి నదీ పరివాహక ప్రాంత వాసులను అప్రమత్తం చేయడంలో సీడబ్ల్యూసీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ క్రమంలో తాజాగా వరదల సీజన్ ప్రారంభం కానున్న తరుణంలో ఈ పర్యటన సాగిందని పేర్కొన్నారు.

పల్లిపాడులో మోటార్ల చోరీలు

● ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

కొణిజర్ల, జూలై5: మండల పరిధిలోని పల్లిపాడు గ్రామంలో గడిచిన పది రోజుల్లో వరుసగా మూడు దొంగతనాలు చోటు చేసుకున్నాయి. రెండు రోజుల క్రితం షేక్ దర్గావలికి చెందిన రూ.25వేల విలువ కలిగిన మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే మరో ఇద్దరి రైతుల మోటార్లు కూడ చోరీకి గురయ్యాయి. గతంలో పల్లిపాడుతో పాటు తనికెళ్ల, కొణిజర్ల, తుమ్మలపల్లి, బోడియాతండా తదితర గ్రామాల్లో మోటార్ల దొంగతనాలు జరిగాయి. వరుస దొంగతనాలతో రైతులు బెంబేతెత్తుతున్నారు. మోటార్ల దొంగతనాలను అరికట్టించాలని రైతులు కోరుతున్నారు.

ఇదేం లెక్క సారూ..

» టీజీఈడబ్ల్యూఐడీసీలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులు..

» ఒకే నెలలో తన పరిధిలో రెండు రకాల ప్రొసీడింగ్స్..

» రాష్ట్రస్థాయి అధికారి నిర్వాకం

పాల్వంచ, జూలై 5: తెలంగాణ రాష్ట్ర విద్య సంక్షేమ, మౌలిక సదుపాయాల కల్పన సంస్థలో అధికారులు నిబంధనలకు పాతరేసి జాతర చేసుకుంటున్నారు. జిల్లా స్థాయి అధికారులే అక్రమాలకు వత్తాసుపలుకుతున్నారనుకుంటే అది పొరపాటే. స్వయంగా రాష్ట్ర స్థాయి అధికారులే రంగంలోకి దిగి జిల్లాస్థాయి అధికారులు అక్రమ మార్గంలో పయనించడానికి ప్రత్యక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ గత నెల 4న జారీ చేసిన సర్క్యులర్ బయటకు రావడంతో ప్రస్తుతం అది భద్రాద్రి జిల్లాలో హాట్ టాఫిక్‌గా మారింది. ఆ సర్క్యులర్ ప్రకారం సర్వశిక్ష అభియాన్ పరిధిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకానికి సంబంధించి 2024-25 సంవత్సరానికి గాను 61 సంవత్సరాలు నిండిన వ్యక్తి అనర్హుడని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పని చేసే తన ప్రియ శిష్యుడి కోసం నిబంధనలు పక్కన పెట్టాడో, లేక భారీ మొత్తంలో డబ్బులు చేతులు మారాయో తెలియదు కానీ, అదే నెలలో 22వ తేదీన తన శిష్యుడికి అనుకూలంగా మరో సర్క్యులర్ జారీ చేశారు. దాని ద్వారా అదే సంస్థలో పని చేసి 2017లో పదవీ విరమణ పొందిన 65 సంవత్సరాల వ్యక్తిని మరోసారి ఖమ్మం డివిజన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో సీనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం, ఆ సంస్థలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

తన పరిధిలోని అధికారులు అన్ని విభాగాల్లో నిబంధనలను అచరించేలా అందరికీ వర్తించేలా ఇచ్చిన ఆదేశాలను తానే తుంగలో తొక్కడమేమిటని సంస్థలోని కింద స్థాయి అధికారులు, సంస్థలోని వివిధ విభాగాల్లో పని చేసే అధికారులు బాహాటంగా చర్చించుకుంటున్నారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడటం, పదవీ విరమణ పొందిన వ్యక్తుల జాబితాను సమర్పించి వారిని సత్వరమే సాగనంపాలని ప్రభుత్వం చెబుతుంటే, మన అధికారులు మాత్రం తమ స్థాయిని మరిచి జి ల్లాస్థాయి అధికారులను ప్రసన్నం చేసుకోవడానికి ఉవ్విళ్లూ రుతున్నారు. ఈ విషయాలపై సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

కత్తితో దాడి చేసిన మహిళ అరెస్ట్

● వివరాలు వెల్లడించిన కొత్తగూడెం టూటౌన్ సీఐ రమేష్

చుంచుపల్లి, జూలై5: మహిళపై విచక్షణ రహితంగా కత్తితో దాడి చేసిన మహిళను కొత్తగూడెం టూటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి టూటౌన్ సీఐ రమేష్ వివరాలు వెల్లడించారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు రుద్రంపూర్ గ్రామ పంచాయతీలో నివసించే చాపలమడుగు శిరీష అనే ఒక మహిళ తన ఇంటిలో తన పిల్లలతో ఉండగా, మరొక మహిళ తలకు ముసుగు ధరించి వచ్చి ఆమె మీద కత్తితో దాడి చేసింది. తీవ్ర గాయాలతో ఉన్న ఆమెను హస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఆమె భర్త అయిన శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బాధితురాలు శిరీష తన చిన్ననాటి మిత్రుడైన దుర్గాప్రసాద్ అనే వ్యక్తితో తరుచుగా ఫోన్ మాట్లాడుతూ చనువుగా ఉంటుందని అతని భార్య అయిన పావని అనుమానం పెంచుకొంది. ఏ విధంగానైనా శిరీషను అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశ్యంతో ఎవరూ లేని సమయంలో చూసి నిందితురాలు పావని బాధితురాలు శిరీషను అంతమొందించాలని కత్తి తీసుకొని వచ్చి ఆమెపై మీద విచక్షణ రహితంగా దాడి చేసింది. శిరీషకు తలపైన, మెడ భాగంలో తీవ్రమైన గాయాలయ్యాయి. శుక్రవారం పావనిగా గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వివరాలను వెల్లడించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్

మావోయిస్టులకు

వ్యతిరేకంగా పోస్టర్ల కలకలం

అశ్వాపురం/ పినపాక/కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 5: జిల్లాలోని పలు మండ లాల్లో శుక్రవారం మావోయిస్టులకు వ్యతిరేకంగా గుర్తు తెలియని వ్యక్తులు పోస్టర్లు, కరపత్రాలను ప్రధాన సెంటరలలో అతికించారు. ప్రజాయుద్ధం మాటున మావోయిస్టులు సాగిస్తున్న అరాచకానికి అంతిమంగా బలవుతున్నది అమాయక ఆదివాసీ గిరిజనులేనని పోస్టర్స్‌లో పేర్కొన్నారు. అమాయకుల ప్రాణాలను బలి తీసుకోవడంపై ప్రజాసంఘాలు, పౌరహక్కులు సంఘాలు ఎందుకు స్పందించడం లేదని, ఈ ఘటనపై నిజ నిర్ధారణ కావాలి అంటూ పోస్టర్స్‌లో పేర్కొన్నారు.



మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్లు

రైతు ఆత్మహత్య కేసులో

8 మంది రిమాండ్

ఖమ్మం క్రైం, జూలై 5: చింతకాని మండల ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన బోజెడ్ల ప్రభాకర్ ఆత్మహత్య కేసులో 8 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖానాపురం సీఐ భానుప్రకాశ్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 1న ఖమ్మం నగర శివారులోని చెరుకూరి గార్డెన్స్ వద్ద ప్రభాకర్ పురుగుల మందు తాగి మృతి చెందిన విషయం విధితమే. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అర్బన్ పోలీసులు విచారణ చేపట్టారు. దీంతో మృతుడు చనిపోకముందు మాట్లాడుతున్న వీడియోను తీసిన యువకుడితో పాటు మరో ఏడుగురిని పోలీసులు రిమాండ్ చేశారు. మొత్తం ఈ కేసులో 13 మందిపై కేసు నమోదు కాగా, వారిలో పెంట్యాల నాగుల్‌మీరా, గుడిపూడి రజనీకాంత్, వేల్పుల కోటయ్య, మొగిలి శ్రీను, షేక్ సిద్దయ్య, వేల్పుల నరసింహారావు, షేక్ సైదులు, మొగిలి మాధవరావు లను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అదేవిధంగా ఈ కేసులో ఉన్న పెండ్యాల పుల్లయ్య, మొగిలి ముత్తయ్య, గుర్రం నాగమల్లేశ్వరావు, కూరపాటి కిషోర్, పెంట్యాల రామారావులు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

మొద్దులగూడెంలో ఆయిల్ ట్యాంకర్ బోల్తా

● ఆయిల్‌ను ఎత్తుకెళ్లిన పరిసర ప్రాంత ప్రజలు

దమ్మపేట, జూలై 5: ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడడంతో అందులోని ఆయిల్‌ను స్థానికులు ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం మండలంలో జరిగింది. ఈ మండలంలోని మొద్దులగూడెం గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం ప్రధాన రహదారిపై ఓ ఆయిల్ టాంకర్ బోల్తాపడింది. కాకినాడ నుంచి హైదరాబాద్‌కు క్రూడ్ ఆయిల్‌తో వెళుతున్న ట్యాంకర్ డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో ఎదురుగా వచ్చే మరో వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా బోల్తాపడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడి ఆయిల్ పోతోందని తెలుసుకున్న పరిసర ప్రాంత ప్రజలు బకెట్లు, డబ్బాలు, వాటర్ బాటిల్స్ పట్టుకొని ఆయిల్ ఎత్తుకెళ్లారు. ఆయిల్ కోసం ఒక దశలో తోపులాటకూడా జరిగింది. భారీగా జనం గుమ్మికూడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్యాంకర్‌లో ఉన్నది ఆయిల్ అని కొందరు, వేరుశనగనూనె అని కొందరు, మరికొందరు సన్‌ఫ్లవర్ ఆయిల్ కొందరు చర్చించుకున్నారు. కానీ అది క్రూడ్ పామాయిల్ తెలుస్తోంది. విష యం తెలుసుకున్న దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.


ఆయిల్ ట్యాంకర్ నుంచి లీక్ అవుతున్న ఆయిల్ కోసం పోటీలు పడుతున్న ప్రజలు

బోనకల్‌లో 16.5 కేజీల గంజాయి పట్టివేత

బోనకల్, జూలై 3: బోనకల్ ఆర్వోబీ దిగువన గల వైరా-జగ్గయ్యపేట ప్రధాన రహదారి పై శుక్రవారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా 16.5 కేజీల గంజాయి పట్టుబడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రావినూతల నుంచి బోనకల్ వైపునకు వస్తున్న రెండు స్కూటీలను తనిఖీ చేయగా గంజాయి దొరికినట్లు తెలిపారు. పోలీసుల విచారణలో ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు అక్రమ రవాణాదారులను గుర్తించారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురానికి చెందిన చిట్టిప్రోలు వంశీ, ఎండుబ్రాల వెంకట సత్యసాయి బాలాజీ, కోట జాన్ వెస్లీ, ఆఫీసా నర్సింహలుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, స్కూటీలను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

దుమ్ముగూడెం, జూలై 5: భార్య తనపై ఫిర్యాదు చేసిందని మనస్తాపం చెంది ఈనెల 4న పోలీస్‌స్టేషన్ ఆవరణలో పురుగుల మందు సేవించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎంకాశీనగరానికి చెందిన చింతం ఎబినేజర్(45)పై అతడి భార్య సలోమి కొడుతున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. విషయం తెలిసిన అతడు పోలీస్‌స్టేషన్‌కు మద్యం మత్తులో వచ్చి మూత్ర విసర్జనకు వెళ్లాడు. అక్కడ ద్విచక్రవాహనంలో దాచి ఉంచిన పురుగుల మందు తాగాడు. వెంటనే పోలీసులు అతడిని ములకపాడు పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం భద్రాచలం ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించింది. మృతుడి అన్న చింతం జాన్‌వెస్లీ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు..

మధిర, జూలై 5: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మధిర-మోటమర్రి రైల్వేస్టేషన్ల మధ్య కిలోమీటరు 528-26-28 వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. 30 సంవత్సరాల గుర్తు తెలియని యువకుడు గూడ్స్ రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు చామనచాయ రంగుకలిగి, గులాబిరంగు షర్టు, నీలం రంగు నైట్ పాయింట్ ధరించి ఉన్నాడు. కుడిచేతిపై అమ్మ, నాన్న అనే పచ్చబొట్టు ఉంది. ఈమేరకు జీఆర్‌పీ అవుట్ పోస్టు ఇన్‌చార్జి వేణుగోపాలరెడ్డి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో బాలుడికి తీవ్ర గాయాలు


ఖమ్మం రూరల్, జూలై 5: ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలి ఓ బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, పెద్దతండా పరిధిలోని శ్రీ సాయి గణేష్‌నగర్ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిగణేష్ నగర్ కాలనీలో నిరోడ్ నెంబర్ 14లో మధురెడ్డి కుటుంబ సభ్యులతో అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటిపైకి కోతులు రావడంతో అతని కుమారుడు భరత్‌రెడ్డి కోతులు కోట్టేందుకు ఇంట్లో ఉన్న కర్రతీసుకుని కోతులను కొట్టేందుకు పైకి వెళ్లాడు. అయితే ఆ ఇంటిపైన 33కేవీ హై టెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయి. కోతులను కొట్టే సమయంలో బాలుడి చేతిలో ఉన్న కర్ర హై టెన్షన్ వైర్లకు తగలడంతో విద్యుత్ షాక్ తగిలింది. ఈ ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు బాలుడిని ఆసుపత్రికి తరలించారు. భరత్‌రెడ్డి ఓ ప్రయివేట్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. అయితే బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఇళ్ల మధ్య గుండా వెళ్లిన 33 కేవీ హై టెన్షన్ విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలని స్థానికులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం చేసిన మైనర్

ఇల్లెందు టౌన్, జూలై 5: ఆరేళ్ల బాలికపై ఓ బాలుడు అత్యాచారం చేసిన సంఘటన ఇల్లెందు మండలంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇల్లెందు పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామంలో ఆరేళ్ల చిన్నారిపై రెండు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలుడు(17) అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లోకి వెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బయటకు రాకుండా ఆ బాలికను బెదిరించాడు. ఆ బాలిక సైతం ఆలస్యంగా తల్లిదండ్రులకు తెలపడంతో, వారు ఇల్లెందు పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యురాలిని సంప్రదించారు. వైద్యురాలి సూచనల మేరకు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెక్‌బౌన్స్ కేసులో వ్యక్తికి 6 నెలలు జైలు

మణుగూరుటౌన్, జూలై 5: బ్యాంక్ చెక్ బౌన్స్ అయిన కేసులో వ్యక్తికి ఆరు నెలలు జైలు శిక్ష వేస్తూ మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాల ప్రకారం.. మణుగూరుకు చెందిన చింతల రాజారాం అనే వ్యక్తి మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని గుత్తుల శ్రీనివాసరావు వద్ద జనవరి 2015లో రూ.3 లక్షలు నగదు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న అప్పు చెల్లించేందుకు గాను రూ.3 లక్షల విలువైన బ్యాంక్ చెక్‌ను ఫిర్యాదు దారుడు 2016 అక్టోబర్ 26న శ్రీనివాసరావుకు ఇచ్చాడు. నగదు డ్రా చేసుకునేందుకు అతడు చెక్‌ను బ్యాంక్‌లో వేయగా, అందులో నగదు లేదంటూ బ్యాంక్ సిబ్బంది చెక్ తిరిగి వెనక్కు ఇచ్చారు. కాగా ఫిర్యాదుదారుడు న్యాయవాది ద్వారా రాజారాంకు లీగల్ నోటీసు జారీ చేసి కేసు వేశాడు. విచారణ జరిపిన మెజిస్ట్రేట్ నేరం రుజువైనందున రాజారాంకు ఆరు నెలల జైలు శిక్షతోపాటు పరిహారంగా రూ.3 లక్షలు శ్రీనివాసరావుకు చెల్లించాలని తీర్పునిచ్చారు. ఫిర్యాది తరపున న్యాయవాది రమణారెడ్డి కేసు వాదించారు.



మంత్రులను కలిసిన నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంకార్పొరేషన్, జూలై 5: ఖమ్మం నగరపాలకసంస్థ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అభిషేక్ అగస్త్య శుక్రవారం హైదరాబాద్ వెళ్లి సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రులకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. తనను కలిసిన కమిషనర్‌తో మంత్రి తుమ్మల నగర అభివృద్ధిపై మాట్లాడారు. పనుల్లో పెండింగ్ లేకుండా అధికారుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు.




మంత్రులు తుమ్మల, పొంగులేటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్

ఏదులాపురం చెరువు సర్వే

ఖమ్మం రూరల్, జూలై 5: మండల పరిధిలోని ఏదులాపురం చెరువు ఆక్రమణలకు గురైందని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు శుక్రవారం రెవెన్యూ అధికారులు చెరువును సర్వే చేశారు. ఆర్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో సర్వే అధికారులు కలిసి చెరువు చుట్టు సర్వే నిర్వహించారు. ఆర్ఐ ప్రసాద్ మాట్లాడుతు చెరువు మొత్తం పూర్తి స్థాయిలో సర్వే చేసి ఆక్రమణలు ఉంటే వాటిని తొలగిస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములు, చెరువు శిఖాలు తదితర వాటిని ఎవరైనా ఆక్రమించుకుంటే ఉపేక్షించేది లేదని ఎంతటి వారైనా సరే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఖమ్మంచర్చి కాంపౌండ్, జూలై 5: జిల్లా కేంద్ర ప్రధాన ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్రా ఉపేంద్రసాహు డిమాండ్‌చేశారు. శుక్రవారం తమ వేతనాలు విడుదల చేయాలని విధులు బహిష్కరించి జిల్లా ప్రధాన ఆసుపత్రి ప్రాంగణంలో దీక్ష శిబిరానికి చేరుకుని సంఘీభావం తెలిపారు. అనతరం నల్లచట్టాలను సవరించాలని న్యాయవాదులు చేస్తున్న రిలేనిరాహారదీక్షకు పార్టీ జిల్లా కమిటీ సంపూర్ణమద్దతు తెలిపింది. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, మిర్యాల నాగరాజు, ఉపేందర్, ఎం.నాగేశ్వరవు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏఎస్ఐ కుటుంబానికి చెక్కు అందజేత

ఖమ్మంక్రైం, జూలై 5: ఇటీవల మరణించిన మధిరరూరల్ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ జి.వెంకన్న కుటుంబ సభ్యులకు రూ.8 లక్షల చెక్కును శుక్రవారం పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అందించారు. సీపీ మాట్లాడుతూ శాఖాపరంగా అదించేందుకు పోలీసు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. పోలీసు కుటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటామన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

» గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టాలి: అధికారులు

సత్తుపల్లి, జూలై 5: సత్తుపల్లి మునిసిపాలిటీలో వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాదులు ప్రభలకుండా 23వార్డులలో స్పెషల్ శానిటేషన్ చేపడతామని మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. శుక్రవారం 40వ సాధారణ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, మునిసిపల్ అధికారులు పాల్గొని పలు అంశాలను ప్రస్తావించగా ఆమోదం తెలిపారు. పారిశుధ్య, నీటి సరఫరా, ఎలక్ట్రికల్ విభాగాలలో సమస్యలు, వీధి కుక్కల బెడదపై చర్చించగా సలహాలు, సూచనలు అందించారు. సమావేశంలో కమీషనర్ మందా రవిబాబుతో పాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో...

సీజనల్ వ్యాదులు ప్రభలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని, ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూడాలని, వ్యక్తిగత శుభ్రతతో పాటు అనారోగ్యం బారిన పడినవారు వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలని ఎంపీడీవో ఆర్‌సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాయలంలో శుక్రవారం వైద్యఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్‌బి, ఐకేపీ అధికారులతో సమావేశమయ్యారు. గ్రామ పంచాయతీలలో వాట్సాప్ ద్వారా సత్వర సమస్యల పరిష్కారానికి మండల స్థాయి అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. గతంలో వ్యాధులు ప్రబలిన ప్రాంతాలలో స్పెషల్ క్యాంప్‌లతో పాటు వ్యాధులను గుర్తించేందుకు పరీక్షలు చేయించనున్నట్లు గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి ఏ.అవినాష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో టీ.కృష్ణ, ఐబీ డీఈఈ వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ జేఈ నాగేశ్వరరావు, ఐకేపీ సీసీలు, పంచాయితీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మధిరటౌన్: గత కొన్న రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో సీజన్ వ్యాదులు ప్రబలే అవకాశం ఉండటంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మధిర మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, కమిషనర్ వేణు కోరారు. శుక్రవారం మధిర మునిసిపల్ కార్యాలయంలో సిబ్బంది తో పాటు మెప్మా, ఆశా వర్కర్ల తో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతు పట్టణంలో ఎక్కడా కూడా శానిటేషన్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ రవీంద్ర, ఆర్.ఐ రాము, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ సైదానాయక్ పాల్గొన్నారు.

●చింతకాని: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రామయ్య తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బందికి సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో రవీంద్రప్రసాద్, తహసీల్దార్ రమేష్, వైద్యాధికారి అల్తాఫ్, పలువురు మండల అధికారులు పాల్గొన్నారు.

●ఏన్కూరు: సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఎస్.రమేస్ అన్నారు. శుక్రవారం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూగ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలుతీసుకోవా లన్నారు. ఈ కార్యక్రమలో ఎంపీటీసీ చీరాల కృష్ణవేణి, తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, పీహెచ్‌సీ వైద్యులు రాములు, మౌనిక, సీహెచ్‌వో శివరాజు, ఐకేపీ ఏపీఎం హరినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఎంపీవో శ్రీమన్నరాయణ పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

ముదిగొండ: గ్రామాల్లో వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం ముదిగొండ రైతువేదికలో అధికారులతో సన్నాహక సమావేశం ఎంపీడీవో శ్రీధర్‌స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజల సహకారంతో పంచాయతీ, వైద్య, అంగన్‌వాడీ, డ్వాక్రా సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు తాగునీటి పైపులైన్ల మరమ్మతులు, వాటర్ ట్యాంకులు శుభ్రం చేయడం, బ్లీచింగ్, క్లోరినేషన్ చేయడం వంటి ప్రత్యేక చర్యలను అధికారులు తీసుకోవాలన్నారు. మండల అధికారులు సీజనల్ వ్యాధులపై పల సూచనలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వసుపులేటి దుర్గ, మండల వైద్యాధికారులు అరుణాదేవి, ధర్మేందర్, విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు, ఏవో మందుల రాధ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయరాజు, ఎంపీవో సూర్యనారాయణ, పీఆర్ ఏఈ వెంకటపతిరాజు, కార్యదర్శులు సంపత్, మణి, వైద్య, డ్వాక్రా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మధిరరూరల్: ప్రస్తుతం వర్షాకాలం సీజన్ అయినందున గ్రామాల్లో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో బి.వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం మధిర మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ మొండెం లలిత మాట్లాడుతూ భారీ వర్షాకాల సమయంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా అధికారులందరూ అందుబాటులో ఉండాలని కోరారు. తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేసేందుకు చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శాస్త్రీ, పలుశాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధిర మునిసిపల్ కమిషనర్




సత్తుపల్లిలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్, ముదిగొండలో మాట్లాడుతున్న ఎంపీపీ హరిప్రసాద్

దివ్యాంగులకు ప్రాధాన్యమిస్తా: కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 5: దివ్యాంగులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి.. ప్రభుత్వం నుంచి చేయూతను అందిస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో దివ్యాంగులు పెద్దసంఖ్యలో కలెక్టర్‌ను కలిసి ఉపాధికి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ పరంగా దివ్యాంగులకు ప్రత్యేక అవకాశాలు కల్పించిందన్నారు. వివిధ శాఖలలో అవకాశాలను బట్టి మీకు ఉపాధికల్పన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ మీకు ఎక్కడ ఎక్కడ ఖాళీలు ఉన్నదీ.. మీకు ఉన్న ఆసక్తి, దానికి మీకు ఉన్న అర్హతలను స్పష్టంగా అందిస్తే ఉపాధి అవకాశాల కల్పనకు కృషిచేస్తానని వికలాంగులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. అంతే కాదు వారితో కలిసి ఫోటో దిగారు. జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్‌కు మిడ్డే మీల్స్ వర్కర్ల వినతి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఖమ్మంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 10 నుంచి పిల్లలకు కోడిగుడ్లు, రాగి జావ పెట్టలేమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న రూ.10వేల నగదు, వేతనానికి పెంచిన రూ.2వేలు, పెండింగ్ బిల్లులను ఖాతాలలో జమచేయాలని కార్మికులు కోరారు. కార్యక్రమంలో నిమ్మటూరి రామకృష్ణ, తడికమళ్ల యోబు, దామాల దయాకర్, పిల్లి భాస్కర్, ఒర్సు రమేష్, పొదిలి సావిత్రి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అడ్డగోలుగా చెట్ల నరికివేత

వైరా, జూలై 5: మొక్కలు నాటండి పర్యావరణాన్ని పరిరక్షించండూ ఓవైపున ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే అదే ప్రభుత్వంలోని కీలకశాఖల కనుసన్నల్లో వైరాలో భారీ చెట్లను అడ్డగోలుగా నరికివేస్తున్నారు. ఆరునెలల కిందట మొదలైన ఈ చెట్ల నరికివేత వైరాలో యథేచ్ఛగా కొనసాగుతుంది. వైరాలో రూ.12కోట్లతో మధిర-జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పేరిట జనవరిలో మొదలైన భారీ చెట్ల నరికివేత కార్యక్రమం ఎన్నికల సమయంలో రెండునెలలు మినహా ప్రస్తుతం యథేచ్ఛగా సాగుతుంది. దాదాపు రెండుకిలోమీటర్ల రోడ్డుకు రెండువైపులా ఉన్న దశాబ్దాల నాటి చెట్లను నరికివేశారు. ఈ రోడ్డులో ప్రజలు నిల్చోవడానికి నిలువ నీడ లేకుండాపోయింది. అవసరం లేకపోయినప్పటికీ ఆర్ అండ్‌బీ అధికారుల కనుసన్నల్లోనే చెట్లను మట్టుబెడుతున్నారు. చెట్ల నరికివేతకు అటవీశాఖ వేసిన నామమాత్రపు నష్టపరిహారాన్ని సదరు వ్యక్తి ప్రభుత్వానికి జమచేసి లక్షలాదిరూపాయల విలువైన చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. వైరాలో జాతీయ ప్రధాన రహదారి నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు నాలుగులైన్ల రోడ్డు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.12కోట్లు మంజూరయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదట్లో మౌఖిక ఆదేశాల మేరకు కొద్ది రోజులు రోడ్డు అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆతర్వాత మళ్లీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో చెట్ల నరికివేతకు తెరదీశారు. అరకొరగా రోడ్డు పనులు ప్రారంభించి వదిలేశారు. ఇప్పుడు యథేచ్ఛగా చెట్లు నరికివేస్తున్నారు.



నరికిన వేపచెట్టు

మెకానిక్ కుటుంబానికి ఆర్థికసాయం

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై 5: ఖమ్మం టూవీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మెకానిక్ కుటుంబానికి శుక్రవారం ఆర్థికసాయం అందించారు. ఖమ్మం నగరంలోని టూవీలర్ మెకానిక్‌గా పనిచేస్తున్న హస్సేన్ గతనెలలో జరిగిన రోడ్డుప్రమాదానికి గురై ఇంటివదనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న యూనియన్ సభ్యులందరు హస్సేన్ కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయాన్ని యూనియన్ జిల్లా అధ్యక్షుడు వంగాల కొండలరావు ఆధ్వర్యంలో అందించారు. ఆయన మాట్లాడుతూ హస్సేన్ కుటుంబానికి యూనియన్ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో రమేష్, మురళి, శ్రీను బ్రహ్మం, రాజు, హరి, సుబాని, అనిల్ పాల్గొన్నారు.

పూర్వ కమిషనర్‌ను ఆశీర్వదించిన మేయర్ నీరజ

ఖమ్మంకార్పొరేషన్, జూలై 5: ఖమ్మం నగరపాలకసంస్థ పూర్వ కమిషనర్, ప్రస్తుత వనపర్తి కలెక్టర్ ఆదర్శ్‌సురభి వివాహ వేడుక సందర్భంగా ఖమ్మం నగరమేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం హైదరాబాద్‌లోని నానక్‌గూడాలోని ఆయన నివాసానికి వెళ్లి ఆశీర్వచనాలు అందజేశారు. ఆదర్శ్‌సురభి వివాహం ఆదివారం ఛండీగఢ్‌లో జరగనుంది. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జరుగుతున్న వేడుకలకు మేయర్ నీరజ హాజరయ్యారు.



పూర్వ కమిషనర్‌ను ఆశీర్వదిస్తున్న మేయర్

స్మార్ట్‌కిడ్జ్‌లో ఘనంగా వనమహోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై5: నగరంలోని స్మార్ట్‌కిడ్జ్‌పాఠశాలలో శుక్రవారంఘనంగా వన మహోత్సవం నిర్వహించారు. పాఠశాల చిన్నారులు మొక్కలతో నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రదర్శన నిర్వహించారు. మొక్కలు నాటుదా...పర్యావరణం కాపాడుదాం ఇంటింటి మొక్కలునాటుదాం..ఊరంతా పచ్చదనం నింపుదాం అనే నినాదాలతో చిన్నారులు ప్లెకార్డులతో ర్యాలీ నిర్వహించారు . ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్మార్ట్‌కిడ్జ్‌లో మానవహారం రూపంలో చిన్నారుల ప్రదర్శన

ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్‌లో సర్వజ్ఞ విద్యార్థి ప్రతిభ

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 5: ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ రాష్ట్ర స్థాయి పోటీలలో నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి అక్షయ రుత్విక్ రాష్ట్ర స్థాయి మెదటి బహుమతి గెలుచుకున్నాడని పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి నాగేంద్రకుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి గణితశాస్త్ర విభాగంలో బహుమతితోపాటు జ్ఞాపికను, ప్రశంసా పత్రాన్ని హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అందుకున్నాడని తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం టి అరుణ దీప్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థితో సర్వజ్ఞ పాఠశాల యాజమాన్యం

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ

బోనకల్, జూలై 5: మండలంలోని రాయనపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంకు శుక్రవారం సొసైటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరావు పిల్లలకు కుర్చీలను వితరణగా అందజేశారు. తన మేనల్లుడి పుట్టినరోజు సందర్భంగా చిన్నారులకు ఉపయోగపడే కుర్చీలను ఇచ్చామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో మరమ్మత్తు పనులకు గానూ తన వంతుగా సాయం అందిస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారుపల్లి ప్రేమ్ కుమార్, చావా నాగేశ్వరావు, మందా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు చేపట్టాలి: సీపీఎం

తిరుమలాయపాలెం: ప్రస్తుత వర్షాకాల సీజన్లట వ్యాధులు వచ్చే అవకాశం ఉందని,వ్యాధులు రాకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను కోరారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యలో ఎంపీడీవో శేషాద్రికి వినతిపత్రం అందించారు 40 గ్రామ పంచాయతీల్లోకూడా వ్యాధులు రాకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని ఇప్పటికే డెంగీ బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం పంచాయతీలకు నిధులు లేకపోవడంతో పారిశుధ్య పపనులు చేపట్టలేకపోతున్నారని నిధులు కేటాయించాలన్నారు. ఈకార్యక్రమంలో పార్టీనాయకులు కొమ్ము శంకర్, ఏపూరి నరేష్, వీరబాబు, వెంకటేశ్వర్లు, కొమ్ము నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చేతిపంపు ప్రారంభం

వైరా, జూలై 5: మండలంలోని పాలడుగు గ్రామంలో గ్రేస్ సొసైటీ వారు ఎస్సీకాలనీలో ఏర్పాటుచేసిన చేతిపంపును వైరా ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ శుక్రవారం ప్రారంభించారు. చేతి పంపును ఏర్పాటుచేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో గుండెపోగు జాన్, రాయల కిరణ్, మోదుగు వినోద్‌కుమార్, జాన్, సతీష్ పాల్గొన్నారు.



సింగరేణి నివాస గృహాల నిర్మాణానికి అనుమతి

సత్తుపల్లిరూరల్, జూలై 5: సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో సింగరేణి అధికారుల నివాస గృహ నిర్మాణ అనుమతి కోసం ఎంపీడీవో ఆర్‌సీహెచ్.నాగేశ్వరరావుకు చెక్కు అందించినట్లు పీవో ఎంవీ.నరసింహారావు తెలిపారు. గ్రామ పంచాయతీ గ్రూప్ డెవలప్‌మెంట్ స్కీమ్ ప్రకారం చెల్లించాల్సిన రూ.41.70లక్షల చెక్కును అందించామని చెప్పారు. కార్యక్రమంలో సివిల్ డీవైఎస్ఈ రవికుమార్, ఎంపీవో టీ.కృష్ణ, పంచాయతీ సెక్రటరీ మద్దెల రవి పాల్గొన్నారు.

ముఖర్జీ జయంతి సందర్భంగా మొక్కలు నాటిన నాయకులు

ఖమ్మంక్రైం, జూలై 5: శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలోని ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా తమ వంతుగా మొక్క నాటాలని మోదీ పిలుపుమేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి సురేష్ తదితరుల పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న గల్లా

ప్రభుత్వాసుపత్రి పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు సస్పెన్షన్

●ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 5: జిల్లా ఆసుపత్రి సూపరిన్‌టెండెంట్‌గా, ఆస్పత్రుల సమన్వయ అధికారిగా పనిచేసిన డాక్టర్ బి వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో హెడ్‌క్వార్టర్స్ ఆస్పత్రిలో సూపరిన్‌టెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆయన జూనియర్ అసిస్టెంట్లు ద్వారా తన అధికారిక పదవిని దుర్వినియోగం చేస్తూ పలువురికి అక్రమంగా పదోన్నతులు కట్టబెట్టారని ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ఆస్పటల్స్ సర్వీసెస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏ సునీత విచారణ అధికారిగా పదోన్నతుల కల్పనపై డాక్టర్ వెంకటేశ్వర్లుపై వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహించారు. ఆమెకు పదోన్నతుల కల్పనపై రికార్డులు, ఫైళ్లను అందించకపోవడంతో అవకతవకలు జరిగాయని భావిస్తూ నివేదికలను ఉన్నతాధికారులకు అందించారు. వాటి ఆధారంగా ఆయనను సస్పెండ్ చేస్తూ వీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఈ పదోన్నతుల్లో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేశారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రముఖులు





కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పెట్రోలియం డీలర్లు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని, వైరా మునిసిపల్ చైర్మన్ జైపాల్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 5: కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ని ఖమ్మం జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసిన పెట్రోడీలర్స్ నూతన కార్యవర్గ సభ్యులు పుష్పగుచ్ఛాలను ఇచ్చి కలెక్టర్‌ను అభినందించారు. ప్రస్తుతం తూనికలు, కొలతల ఆఫీసర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారని ఆయన స్థానంలో పూర్తిస్థాయి ఆఫీసర్‌ని నియమించాలి అని కోరారు. ఈ కార్యక్రం లో అసోసియేషన్ ప్రసిడెంట్ ఈశ్వరప్రగడ రంగనాథ్, సెక్రటరీ కూరపాటిమంజుల,కోశాధికారి వజినేపల్లి శ్రీనివాస్, రవికుమార్, డీలర్స్ నాగబత్తిని రవి, మోతుకూరి గోపాలరావు, సన్ ఉదయ్ ప్రతాప్, కీమా నాయక్, మాగంటిప్రసాద్, విప్లవ కుమార్, వేగ్లళం శ్రీనివాస్ , మలిశెట్టి వరుణ్ ,దమ్మాలపాటి నగేష్ , మద్ది పిచ్చయ్య, దిలీప్ రెడ్డి, నాగబాతినిభాస్కర్ రావు తదితరులున్నారు.

కలెక్టర్ ని కలిసిన బాలసాని

కలెక్టర్ ముజామిల్ ఖాన్‌ను మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్ నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ శుక్రవారం కలిశారు. కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువతో సత్కరించారు. గతంలో జిల్లా అభివృద్ధికి తాను కేటాయించిన నిధులు, అభివృద్ధి పనులపై కలెక్టర్‌కు బాలసాని వివరించారు.

కలెక్టర్‌ను కలిసిన జైపాల్

వైరా: జిల్లా కలెక్టర్ ముజ్మమిన్‌ఖాన్‌ను వైరా మునిసిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఖాన్‌ను జైపాల్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వైరా మునిసిపాలిటీ అభివృద్ధికి తమవంతు తోడ్పాటునివ్వాలని కోరారు.

భూ తగాదా విషయంలో గొడ్డలితో దాడి

ఖమ్మం రూరల్, జూలై 5: భూ తగాదా విషయంలో గొడ్డలితో దాడి చేసిన సంఘటనపై ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసునమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుర్రాలపాడు గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వర్లు, దాసరి బొర్రయ్య పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. పొలం గెట్టు రాయి జరిగిందని దాన్ని ఎందుకు జరిపారని బొర్రయ్యను వెంకటేశ్వర్లు అడిగేందుకు వెల్లాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అక్కడే ఉన్న వెంకటేశ్వర్లు కుమారుడు సైదులు కూడా ఘర్షణ జరుగుతుందని అక్కడికి వెల్లాడు. ఈ ఘర్షణలో బొర్రయ్య తన వద్ద ఉన్న గొడ్డలితో వెంకటేశ్వర్లు, సైదులు పై దాడి చేశాడు. దీంతో వెంకటేశ్వర్లు, సైదులుకి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటనపై వెంకటేశ్వర్లు భార్య రాంబాయమ్మ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎర్రుపాలెం జూలై 5: మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారుకు శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులను తాహసీల్దార్ మన్నే ఉషాశారద పంపిణీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవరకొండ శిరీష, జడ్పీటీసీ శీలం కవిత, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు నరసిహారావు, అనుమోలు కృష్ణారావు, పెద్దగోవరం సొసైటీ అధ్యక్షుడు శీలం అక్కిరెడ్డి, నాయకులు యన్నం పిచ్చిరెడ్డి వేమిరెడ్డి వెంకటరెడ్డి, వేమిరెడ్డి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న తహసీల్దార్

ఘనంగా రేణుక ఎల్లమ్మ వేడుకలు



తల్లాడ, జూలై 5: తల్లాడ మండలం కేశ్వాపురంలో రేణుక ఎల్లమ్మ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కోలాట నృత్యంతో బోనాలు ఎత్తుకొని ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. సొసైటీ చైర్మన్ దిరిశాల నర్సింహారావు, ఎస్ఐ బి.కొండల్‌రావు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చంద్రరావు పాల్గొన్నారు.



బోనాలతో వస్తున్న మహిళలు